సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 6 ၊ జూలై ၊ 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.35, కనిష్టంగా రూ.23 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.6°/23.4°

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు మరింత పెరిగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయంలో చేరిన నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర డ్యాంకు వరద మరింత పెరిగింది. బుధవారం 10 వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం 19,201 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 12 టీఎంసీల వరకు నీరు చేరింది. అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులుగా నమోదైంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1590.80 అడుగు వరకు నీళ్లు చేరాయి. ఇన్నాళ్లూ నిరాశ కలిగించిన ఇన్‌ఫ్లో కొద్ది రోజులుగా వేగం పుంజుకుంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శివమొగ్గ, తీర్థనహళ్లి, చిక్‌మంగుళూరు, వరనాడు, శృంగేరి తదితర డ్యాం ఎగువ భాగంలోని ప్రాంతాల్లో బాగానే వర్షాలు కురుస్తుండడంతో నీటి చేరిక పెరుగుతోంది. దీంతో కర్ణాటక, ఆంధ్రాకు సంబంధిచిన ఎగువ కాలవ (హెచ్చెల్సీ) ఆయకట్టు రైతులు వరుణుడి కరుణతో రిజర్వాయర్ త్వరగా నిండాలని వేడుకుంటున్నారు. గతడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,576.69 అడుగులతో 3.071 టీఎంసీలతో 259 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి 60 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.


కెంకెరలో వైద్యశిబిరం



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

అమరాపురం: డయేరియా ప్రబలిన కెంకెరలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ వైద్య శిబిరం నిర్వహించింది. వైద్యులు గ్రామస్తులను పరీక్షించి మందులు అందజేశారు. కెంకెర గ్రామంలోని ఎస్సీ కాలనీలో డయేరియా తీవ్ర రూపం దాల్చగా.. నాగభూషణ గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. 'సాక్షి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో శుక్రవారం ఉదయమే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మంజువాణి, జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్, గ్రామీణ నీరుపారుదల శాఖ డీఈ మను నాయక్, డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి తదితరులు కెంకెర గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వీధులను పరిశీలించిన అధికారులు.. వెంటనే వాటిని శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మంజువాణి రోగులను పరీక్షించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మందులు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులు సూచించారు. మరుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు అందులో దోమలు వృద్ధి చెందకుండా మందును పిచికారీ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీరుపారుదల శాఖ డీఈ మను నాయక్ సిబ్బందిని ఆదేశించారు. అధికారుల వెంట ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి నరేష్, డాక్టర్లు భార్గవ్, జయకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, ప్రసన్న సిబ్బంది ఉన్నారు.

10న పెన్షన్ అదాలత్



అనంతపురం సిటీ: ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 10న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ కడప రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 గౌరవ్ మహల్వాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై నెలకు సంబంధించి వెబెక్స్ వేదికగా పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లతో పాటు సమీప భవిష్యత్‌లో పెన్షనర్లు కానున్న వారి సమస్యలను పరిష్కరించడమే అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాదలచిన వారు https://meet309.webex.com/meet309/j.php?MTID=m0b-de3671619d8e427ae3493e55c6f37సంప్రదించాలని సూచించారు.

మీటింగ్ నంబర్ : 2644 663 9754
పాస్‌వర్డ్ : 1234
తేదీ : 10.7.2024
సమయం : ఉదయం 11 గంటలు

అతిసారం.. ఆందోళనకరం

వాతావరణంలో మార్పులు, కలుషిత నీరు, కలుషిత ఆహారం తదితర వాటివల్ల జిల్లాలో డయేరియా విజృంభిస్తోంది. రోజురోజుకూ ప్రతాపం చూపుతూ చాపకింద నీరులా ప్రబలుతోంది. పల్లెల నుంచి మెల్లగా పట్టణాలకూ వ్యాపిస్తోంది. ఫలితంగా వేల సంఖ్యలో కేసులు నమోదు కాగా, జనం భయపడిపోతున్నారు. ఇప్పటికే ఆస్పత్రులన్నీ డయేరియా బాధితులతో నిండిపోయాయి.

'డై'యేరియా

- భయపెడుతున్న డయేరియా కేసులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- రోగులతో నిండిపోయిన వార్డులు
- ఆరు నెలల్లో రెండు వేలపైగా కేసులు
- అమరాపురం మండలంలో ఒకరి మృతి
- చాపకింద నీరులా ప్రబలుతున్న డయేరియా



ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



సాక్షి, పుట్టపర్తి

జిల్లా వాసులను డయేరియా (నీళ్ల విరేచనాలు) భయపెడుతోంది. ఈ ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకు 2,068 కేసులు నమోదు కాగా అందరిలోనూ ఆందోళన నెలకొంది. అందులో జూన్ నుంచి జూలై 4వ తేదీ వరకు 653 కేసులు ఉండటం గమనార్హం. ఈనెల 4వ తేదీన అమరాపురం మండలం కెంకర గ్రామంలో డయేరియా కారణంగా నాగభూషణ (28) మృత్యువాత పడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఆస్పత్రులన్నీ కిటకిట..

డయేరియా వేగంగా ప్రబలుతున్న క్రమంలో జిల్లాలోని ఆస్పత్రులన్నీ రోగులతో నిండిపోయాయి. ఏ ఆస్పత్రి వద్ద చూసినా.. ఓపీ (ఔట్ పేషెంట్స్) లైన్ భారీగా కనిపిస్తోంది. కదిరి, ధర్మవరం, హిందూపురం ఆస్పత్రులన్నీ డయేరియా రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైరస్ కారణంగా సోకే డయేరియా రెండేళ్ల కంటే తక్కువ వయస్సుగల పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రోజురోజుకూ డయేరియా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

లక్షణాలు..

- డయేరియా 1 నుంచి 2 రోజుల వరకు ఉంటుంది. అయితే ఇది కొన్నిసార్లు 2 వారాల వరకూ ఉండే అవకాశం ఉంటుంది. అప్పుడే చాలా ప్రమాదకరం.
- రెండు రోజులకు మించి అతిసారం ఉంటే డీహైడ్రేషన్ ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. నీళ్ల విరేచనాలు, వాంతులు, జ్వరం కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాలకే నష్టం జరుగుతుంది.
- ఉదరంలో అపెండిసైటిస్, డైవర్టికులిటిస్, పేగుకు అవరోధం లేదా పేగుకు చిల్లులు వంటి తీవ్రమైన సమస్యకు దారి తీస్తుంది.
- డయేరియా వల్ల తీవ్రమైన కడుపు నొప్పితో పాటు వికారం, వాంతులు, ఉబ్బరం లేదా మలబద్ధకంతో బాధపడతారు.
- డయేరియా సాధారణంగానే అనిపించొచ్చు. కానీ, తగిన సమయంలో చికిత్స చేయకపోతే రోగి ప్రాణాలకే ప్రమాదం.

జిల్లాలో డయేరియా కేసుల వివరాలు ఇలా..

నెల	సంఖ్య
జనవరి	256
ఫిబ్రవరి	216
మార్చి	302
ఏప్రిల్	328
మే	313
జూన్	576
జూలై	77 (జూలై 4 వరకు)
మొత్తం	2,068

కారణాలు

- కలుషిత నీరు, ఆహారం, వైరస్‌లు, బ్యాక్టీరియా, పరాన్నజీవులు వంటి వివిధ కారణాల వల్ల డయేరియా రావచ్చు. ఇది జీర్ణవ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- సాల్మోనెల్లా, కాంపిలోబాక్టర్ వంటి హానికరమైన సూక్ష్మజీవులతో కలుషితమైన ఆహారాన్ని తిన్నప్పుడు డయేరియా త్వరగా సోకే అవకాశం ఉంది.
- కొన్ని వైరస్‌లు పేగుల్లో ఉండే కణాలకు సోకడం ద్వారా డయేరియాకు కారణం అవుతాయి.
- కొన్ని బ్యాక్టీరియాలు పేగు లైనింగ్‌ను దెబ్బతీసే టాక్సిన్‌లను ఉత్పత్తి చేయడం ద్వారా లేదా పేగు గోడపై దాడి చేసి మంటను కలిగించడం ద్వారా డయేరియాకు కారణం అవుతాయి.

నివారణ మార్గాలు

- డీహైడ్రేషన్ నివారించడానికి ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. పాల ఉత్పత్తులు, జిడ్డుతో కూడిన లేదా కారంగా ఉండే ఆహారం, ఆల్కహాల్ లేదా కెఫిన్‌ను పూర్తిగా నివారించాలి.
- రెండు రోజులకు మించి విరేచనాలు ఉంటే చికిత్స చేయించుకోవాల్సిందే. తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.
- చేతులు శుభ్రంగా కడుక్కుంటే తీవ్రస్థాయి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లను నిరోధించవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితి అంచనా వేసి వైద్యుల సాయం తీసుకోవాలి. శరీరంలో ఎలాంటి భిన్న లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. నీళ్ల విరేచనాలు ప్రారంభమైన తొలి రోజే ఆస్పత్రికి వెళ్తే మంచిది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ మంజువాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

నేడు శాస్త్రవేత్తల బృందం రాక

- ఉమ్మడి జిల్లాలో చీనీ తోటల స్థితిగతుల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: చీనీ తోటల స్థితిగతులు, రైతుల అనుభవాలు తెలుసుకునేందుకు ఢిల్లీలోని భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం నుంచి పది మంది శాస్త్రవేత్తలతో కూడిన బృందం శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లాకు వస్తోంది. డాక్టర్ రాజేశ్వర్‌సింగ్ చాండెల్, డాక్టర్ వాస్సాసింగ్ దిల్లాన్, డాక్టర్ ఏఎన్ గణేష్‌మూర్తి, డాక్టర్ వీకే చక్రవర్తి, ప్రొఫెసర్ రామకృష్ణపాల్, డాక్టర్ ఏకే దాస్, డాక్టర్ ఏ.తిరుంగనవేల్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కేటీ వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కూడిన బృందం పర్యటన వివరాలను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యాన అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, జి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చీనీ సాగులో పాటిస్తున్న యాజమాన్య పద్ధతులు, వస్తున్న దిగుబడులు, మార్కెటింగ్, ఇటీవల కాలంలో ఆశిస్తున్న చీడపీడలు, వాటి నివారణ పద్ధతుల గురించి శనివారం మధ్యాహ్నం అనంతపురం డ్వామా హాలులో ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో చీనీ తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నట్లు వెల్లడించారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో నర్సరీలను సందర్శించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విరివిగా రుణాలివ్వాలి

- బ్యాంకర్లతో జేసీ అభిషేక్‌కుమార్



'క్రెడిట్ ప్లాన్'ను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విరివిగా రుణాలిచ్చి ఆయా వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటు అందించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బ్యాంకర్లను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి రివ్యూ కమిటీ(డీఎల్ఆర్‌సీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. 'స్టాండప్ ఇండియా' పథకం కింద విరివిగా రుణాలు అందించాలన్నారు. దరఖాస్తులు తిరస్కరించినా, ఆవిషయం స్పష్టంగా తెలపాలన్నారు. కేంద్రం అందించే రుణాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్యాంకర్ల సమావేశం నిర్వహిస్తామన్నారు.

రూ.150 కోట్ల రుణ మంజూరుకు ఆమోదం

జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రుణాలు అందజేయాలని జేసీ ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు రూ.150 కోట్ల రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, జిల్లాలో 23 బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే జిల్లా పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్న 49 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రుణాలు అందజేయాలన్నారు. గోరంట్ల సమీపంలో ఆర్ఎస్ఈటీఐ కార్యాలయ ఏర్పాటుకు స్థల సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన 'పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్' పుస్తకాన్ని జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి గిరిధర్, నాబార్డు డీడీఎం అనురాధ, ఎల్‌డీఎం రమణకుమార్, డీపీఓ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి

ఎస్పీ మాధవరెడ్డి



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులు క్రమశిక్షణతో మెలగాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకోసం పరేడ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ పార్టీ పోలీసులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ స్టేషన్ల సిబ్బంది, హోంగార్డులు పరేడ్ నిర్వహించారు. పర్యవేక్షణకు వచ్చిన ఎస్పీ సిబ్బంది ఉద్దేశించి మాట్లాడారు. పరేడ్ వల్ల పోలీసులు ఫిట్‌గా ఉండటంతో పాటు ఐకమత్యం అలవడుతుందన్నారు. పోలీస్ విధి నిర్వహణలో పరేడ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని, విధుల్లో చేరే సమయంలో ఇచ్చే శిక్షణను మరోసారి గుర్తు చేస్తుందన్నారు. ప్రతి పోలీస్ నెలలో కనీసం రెండు సార్లు పరేడ్ నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం, కుటుంబం శాంతియుతంగా ఉంటుందన్నారు. పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, విధి నిర్వహణలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, పాటు హోంగార్డులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులకు అభినందన..

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాధవరెడ్డి 298 మంది హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అందరి సమష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామన్నారు. ఇందులో హోంగార్డుల పాత్ర కూడా మరవలేమన్నారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు.



శాండీ సేవలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

శాండీ సేవలు మరవలేనివి..

పోలీస్ జాగిలం శాండీ సేవలు మరువలేనివని ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 ఏళ్ల పాటు పోలీస్ విధుల్లో విశిష్ట సేవలు అందించిన జాగిలం శాండీకి పోలీసులు విశ్రాంతినిచ్చారు. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది పూలమాలలు, శాలువతో శాండీని సన్మానించారు.


బీమా ధీమా ఎప్పుడో?

పంటల బీమా పథకం అమలుపై చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇంకా ఎటూతేల్చలేదు. గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసినట్లుగా ఉచితంగా అమలు చేయాలా.. లేదంటే రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుని అమలు చేయాలా అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. అయితే పాత పద్ధతి అంటే రైతులపై ప్రీమియం భారం మోపడానికి మొగ్గు చూపుతున్నట్లు సూత్ర ప్రాయంగా తెలుస్తోంది.

- వర్షాభావంతో గతేడాది పూర్తిగా దెబ్బతిన్న ఖరీఫ్, రబీ పంటలు
- ఏటా జూన్‌లోనే ఉచిత పంటల బీమా కింద పరిహారం
- గత ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.1,883 కోట్లు
- మొదటి నాలుగేళ్లు అతివృష్టి, గతేడాది మాత్రం అనావృష్టి
- నిబంధనల మేరకు ఈసారి కూడా పెద్ద ఎత్తున పరిహారం..!
- పంటల బీమా పథకంపై నోరుమెదపని 'బాబు' సర్కారు



చీనీ



వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2024 సీజన్ మొదలైంది. రాష్ట్రంలో కొలువుదీరిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పంటల బీమాపై ఎటువంటి ప్రకటనా చేయకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. గత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ–క్రాప్ ఆధారంగా అత్యంత పారదర్శకంగా ఉచిత పంటల బీమా పథకం అమలు చేసింది. ఖరీఫ్ మొదలు కాగానే ఉచిత బీమా కింద అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన పంటలను నోటిఫై చేస్తూ వాతావరణ, ఫసల్‌బీమా పథకాలు అమలు చేసింది. ఇలా ఏటా పది వ్యవసాయ పంటలు, నాలుగు ఉద్యాన పంటలకు బీమా వర్తింపజేసి రాష్ట్ర ప్రభుత్వమే రైతుల తరఫున బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించి.. నిబంధనల మేరకు పరిహారం వచ్చేలా గట్టి చర్యలు తీసుకుంది. అతివృష్టి సంభవించినా రైతులకు బీమాతో ధీమా కల్పించారు. మొదటి నాలుగేళ్ల కాలంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏకంగా 14.20 లక్షల మంది రైతులకు రూ.1,883 కోట్ల పరిహారం జమ చేయడం విశేషం. ఈ క్రమంలో గతేడాది అంటే 2023 ఖరీఫ్‌కు సంబంధించిన బీమా పరిహారం రావాల్సి ఉంది. గత ప్రభుత్వం కరువు జిల్లాలను ప్రకటించిన నేపథ్యంలో గతేడాదికి సంబంధించి బీమా పథకం కింద పెద్ద మొత్తంలో పరిహారం రావడానికి అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- అనంతపురం జిల్లాకు సంబంధించి గత ఖరీఫ్‌లో మండలం యూనిట్‌గా వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటకు వాతావరణ బీమా కల్పించారు. జిల్లాలోని 214 ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్లలో నమోదైన వర్షపాతం, ఉష్ణోగ్రతలు, ఇతరత్ర వాతావరణ గణాంకాల ఆధారంగా బీమా పరిహారం లెక్కిస్తారు. ఇక ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరపకు ఇచ్చారు. ప్రణాళికశాఖ నిర్వహించే పంటకోత ప్రయోగాలు, వాటి దిగుబడుల ఆధారంగా పంటలకు బీమా పరిహారం లెక్కించనున్నారు.
- శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో తీసుకుంటే ఖరీఫ్‌లో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటకు వర్తింపజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 173 వెదర్‌స్టేషన్లలో నమోదైన వాతావరణ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, అలాగే జిల్లా యూనిట్ కింద ఆముదం, రాగి పంటలకు బీమా వర్తింపజేశారు.

పంటల వారీగా బీమా పరిహారం..

ఉమ్మడి జిల్లా పరిధిలో వాతావరణ బీమా కింద వేరుశనగ పంటకు హెక్టారుకు రూ.72,500, పత్తికి రూ.90 వేలు, దానిమ్మకు రూ.1.75 లక్షలు, చీనీకి రూ.1.25 లక్షలు, టమాటకు రూ.80 వేల చొప్పున పరిహారం వర్తింపజేశారు. అలాగే ఫసల్‌బీమా కింద కంది హెక్టారుకు రూ.45 వేలు, వరికి రూ.97,500, జొన్నకు రూ.50 వేలు, మొక్కజొన్నకు రూ.80 వేలు, ఎండుమిరపకు రూ.2 లక్షలు, రాగికి రూ.45 వేలు, తొలిసారిగా బీమా పథకంలో నోటిఫై చేసిన ఆముదం పంటకు అనంతపురం జిల్లాలో హెక్టారుకు రూ.45 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.40 వేల చొప్పున పరిహారం ఖరారు చేశారు.

జగన్ హయాంలో ఉచిత పంటల బీమా కింద ఉమ్మడి జిల్లాకు వచ్చిన పరిహారం ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	వచ్చిన పరిహారం
2019-20	4,52,074	రూ.362.14 కోట్లు
2020-21	2,46,469	రూ.266.04 కోట్లు
2021-22	4,04,462	రూ.855.53 కోట్లు
2022-23	3,17,567	రూ.369.09 కోట్లు
నాలుగేళ్లలో	14,20,572	రూ.1,882.80 కోట్లు

2014-2018 మధ్య చంద్రబాబు హయాంలో రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుని పంటల బీమా కింద ఇచ్చిన పరిహారం..

సంవత్సరం	రైతులు కట్టిన ప్రీమియం	వచ్చిన పరిహారం	లబ్ధిదారుల సంఖ్య
2014-15	రూ.14.09 కోట్లు	రూ.25.61 కోట్లు	47,627
2015-16	రూ.115.06 కోట్లు	రూ.109.66 కోట్లు	1,85,194
2016-17	రూ.44.64 కోట్లు	రూ.419.10 కోట్లు	5,07,658
2017-18	రూ.72.10 కోట్లు	రూ.159.70 కోట్లు	3,10,115
2018-19	రూ.80.02 కోట్లు	--	--
ఐదేళ్లలో	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594

క్లుప్తంగా

కిరాణా దుకాణం దగ్ధం



దుకాణంలో కాలిపోయిన సరుకులు

మడకశిర: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ కిరాణా దుకాణం దగ్ధమైంది. వివరాలు... మడకశిరలోని సదాశివపురం ప్రాంతానికి చెందిన నాగలక్ష్మి ఓ చిన్నపాటి కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. గురువారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగించుకున్న అనంతరం 9 గంటలకు దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు వస్తుండడం గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో కలసి నాగలక్ష్మి అక్కడకు చేరుకుని తలుపులు తీసింది. అప్పటికే మంటల్లో దుకాణంలోని సరుకులు మొత్తం కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పలువురు కౌన్సిలర్లు ఘటనాస్థలాన్ని సందర్శించి, బాధితురాలిని పరామర్శించారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

కుందుర్పి: ప్రార్థనల పేరుతో నమ్మించి బాలికను విజయవాడకు తరలించిన బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన పాస్టర్ కొల్లప్ప అలియాస్ మాణిక్యరాజుపై పోక్సో కేసు నమోదు చేసి, శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని వివిధ గ్రామాల్లో కొల్లప్ప తననుతాను పాస్టర్‌గా పరిచయం చేసుకుని ప్రార్థనలతో స్వాంతన కల్గిస్తానని మహిళలను మోసగించి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు అపహరించుకెళ్లినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ క్రమంలోనే కుందుర్పికి చెందిన ఓ బాలికను ప్రార్థనల పేరుతో విజయవాడకు తరలించాడన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం కొల్లప్పపై పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తల దాడి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని కల్యాణకట్టలో పనిచేస్తున్న యువకుడు మంగలి రవిపై శుక్రవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. వివరాలు... రవి తన వాట్సాప్ స్టేటస్‌లో వైఎస్సార్‌సీపీకి సంబంధించిన పోస్టు పెట్టాడు. ఇది నచ్చని టీడీపీకి చెందిన భీమప్ప, సుమన్, విజయ్, మంజునాథ్, రాము తదితరులు శుక్రవారం ఉదయం కల్యాణకట్టకు చేరుకుని రవి బయటకు లాక్కెళ్లి చితకబాదారు. తీవ్రంగా గాయపడిన రవిని స్థానికులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

అల్లుడే కాలయముడు..

- మరో ఇద్దరితో కలసి మామపై దాడి
- వేటకొడవండ్లతో నరికి హతమార్చిన వైనం
- భార్యను కాపురానికి పంపలేదనే కక్షతో దారుణం
- నిందితుడిని పట్టించిన పోలీసు జాగిలం

గుంతకల్లు రూరల్: అల్లుడే కాలయముడయ్యాడు. కుమార్తెను కాపురానికి పంపలేదన్న క్షతో మరో ఇద్దరితో కలసి వేటకొడవండ్లతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో మామ అక్కడికక్కడే హతమయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులతో పాటు ఏమీ తెలియని వాడిలా తానూ అక్కడకు చేరుకున్నాడు. క్షణాల వ్యవధిలోనే స్నిఫ్పర్ డాగ్ నిందితుడిని పోలీసులకు పట్టించింది. గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన మేరకు....

మేనల్లుడికే కట్టబెట్టి

గుంతకల్లు మండలం నల్లదాసరపల్లికి చెందిన లక్ష్మన్న (50), కృష్ణవేణి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న లక్ష్మన్న.. నాలుగేళ్ల క్రితం తన రెండో కుమార్తె లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో నివాసముంటున్న తన సొంత అక్క కుమారుడు చంద్రశేఖర్‌కు ఇచ్చి పెళ్లి జరిపించాడు. కొన్నాళ్ల పాటు వీరి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత కలతలు మొదలయ్యాయి. మొదటి కాన్పు కోసం పుట్టింటికి వచ్చిన కుమార్తె తన భర్త వేధింపుల గురించి తల్లిదండ్రుల వద్ద చెప్పుకుని బాధపడింది.

వేధింపులు తాళలేక పుట్టింటికి

మొదటి కాన్పులో కూతురును ప్రసవించిన అనంతరం కుమార్తెకు తల్లిదండ్రులు నచ్చజెప్పి కాపురానికి పంపారు. ఎవరెన్ని చెప్పినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం వేధింపులు తాళలేక పుట్టింటికి చేరుకుంది. ఆ తర్వాత ఆమె కాపురానికి వెళ్లలేదు. అప్పటికే లలిత మూడు నెలల గర్భిణి. తన భార్యను కాపురానికి పంపాలని చంద్రశేఖర్ తరచూ గొడవపడేవాడు. కొన్ని నెలల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా లక్ష్మన్న తన కుమార్తెను కాపురానికి పంపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆ సమయంలో చంద్రశేఖర్ ఆవేశంతో ఊగిపోతూ లక్ష్మన్నను చంపుతానని రెచ్చిపోయాడు. పెద్ద మనుషులు నచ్చచెప్పడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది.



హతుడు లక్ష్మన్న

మాటు వేసి... హతమార్చి

మామపై కక్ష పెంచుకున్న చంద్రశేఖర్ అదను కోసం కాచుకున్నాడు. గురువారం గుంతకల్లుకు చేరుకున్న లక్ష్మన్న బ్యాంకులో రుణం చెల్లించి రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అప్పటికే తిమ్మాపురం – నల్లదాసరపల్లి గ్రామాల మధ్యన తన అన్న రాజశేఖర్, మరో వ్యక్తితో కలసి మాటువేసిన చంద్రశేఖర్... ఒంటరిగా వస్తున్న లక్ష్మన్నపై ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. వేటకొడవండ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల మాటున పడేసి వెళ్లిపోయారు.

పట్టించిన పోలీసు జాగిలం

గురువారం అర్ధరాత్రి సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై పడి ఉన్న రక్తపు మరకలు గమనించి అనుమానంతో చుట్టుపక్కల గాలించారు. చెట్ల మాటున పడి ఉన్న లక్ష్మన్న మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే చంద్రశేఖర్ కూడా ఏమీ తెలియని వాడిలా అక్కడకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో పాటు తానూ రోదిస్తూ కూర్చొన్నాడు. హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే అనంతపురం నుంచి క్లూస్ టీంతో పాటు స్నిఫ్పర్ డాగ్‌ను రప్పించుకుని రంగంలో దించారు. దాడి జరిగిన ప్రాంతం వద్ద చక్కర్లు కొట్టిన పోలీసు జాగిలం మెలమెల్లగా చంద్రశేఖర్‌ను చుట్టుముట్టింది. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తానే హతమార్చినట్లు అంగీకరించాడు. హత్యకు పాల్పడిన తీరును వివరించాడు. హతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బావిలో పడి వివాహిత మృతి



మంజుల మృతదేహం

గుడిబండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం రామయ్యన హట్టి గ్రామానికి చెందిన క్రిష్టప్ప, మంజుల (26) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పొలం పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మంజుల పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తాగునీటి కోసం వెళ్లిన ఆమె అదుపు తప్పి బావిలో పడింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో తోటి కూలీలు అక్కడికెళ్లి చూశారు. ఒడ్డున చెప్పులు కనిపించడంతో బావిలో పడి ఉంటుందని భావించి గాలింపు చేపట్టి మంజులను వెలికి తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

‘పెంపుడు’ జంతువులు.. పొంచి ఉన్న రోగాలు

నందర్భం నేడు ప్రపంచ ‘జూనోసిస్‌డే’

అనంతపురం అగ్రికల్చర్: జంతువులతో మనిషికి ఉన్న బంధం ఈనాటిది కాదు. శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. కొందరు పాడికోసం.. ఇంకొందరు వ్యాపారం కోసం... మరికొందరు రక్షణ కోసం... సంతోషం కోసం జంతువులను పెంచుకుంటూ ఉన్నారు. ఇందులో భాగంగా వాటితో సన్నిహితంగా మెలుగుతుంటారు. అయితే ఆయా జంతువుల వల్ల వచ్చే భయంకరమైన వ్యాధుల గురించి మాత్రం చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రతీ జంతువు నుంచి మనుషులకు బోలెడన్ని వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధులపై ప్రజలను చైతన్య పరిచేలా ఏటా జూలై 6న ‘ప్రపంచ జూనోసిస్ డే’ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేసి, జూనోటిక్ వ్యాధులపై చైతన్య పరుస్తున్నారు.

జంతుప్రేమ మంచిదే

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, పిచ్చుకలు, కుందేళ్లు, పావురాలు లాంటి అన్ని రకాల జంతువులు, పశుపక్షాదులపై ప్రేమ చూపించడం మంచిదే కానీ, అతిగా చేయడం వల్ల అనర్థాలు కూడా పొంచి ఉన్నాయని పశువైద్యాధికారులు అంటున్నారు. పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు ప్రపంచ వ్యాప్తంగా పరస్పరం 200 వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందంటున్నారు. ఇందులో ప్రధానంగా రేబీస్, అంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, టీబీ, బ్రూసెల్లోసీస్, మెదడువాపు లాంటి ప్రాణాంతక, హానికరమైన జబ్బులు కూడా ఉన్నాయన్నారు. పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, క్రమం తప్పకుండా టీకాలు వేయించకపోవడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో శనివారం నిర్వహించే జూనోసిస్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల్లో పెంపుడు, వీధి జంతువులకు ఉచితంగా రోగ నిరోధక టీకాలను వేయనున్నారు. అనంతపురం జిల్లాకు 19,980 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాకు 14,280 డోసుల రేబీస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచారు.



పలు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు..

మేకలు	రింగ్‌వార్మ్, లిస్టిరయేసిస్
గుర్రాలు	గ్లాండర్స్, మెదడువాపు, అస్పంల్లోసిస్, క్షయ, బ్రికోల్లా
పందులు	క్షయ, శ్వాసకోశ వ్యాధులు, రేబీస్
కుక్కలు	రేబీస్, బుసెల్లా, ప్లాజీ
ఎలుకలు	ప్లాజీ, లెప్టోస్పిరోసిస్, మెదడువాపు
కోతులు	రేబీస్, మిసిసల్స్
కుందేలు	తలసీమియా, టుటాక్యోప్లాసీమెను
పక్షులు	సిట్టకోకోసిస్, సాల్మోసెల్లోసిస్, అస్పంల్లోసిస్

జాగ్రత్తలు పాటించండి



జంతువులపట్ల ప్రేమగా ఉండొచ్చు. కానీ, జాగ్రత్తలు పాటించకుండా వ్యవహరించటం ప్రాణాల మీదకు కొనితెచ్చుకోవడమే అవుతుంది. కాబట్టి పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్తలు పాటించండి. జంతువుల నుంచి మనుషులకు... మనుషుల నుంచి జంతువులకు పరస్పరం సంక్రమించే ‘జూనోటిక్’ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏటా జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా ‘జూనోసిస్‌డే’ను నిర్వహిస్తున్నాం. రాష్ట్ర డైరెక్టరేట్ ఆదేశాల మేరకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. శనివారం నిర్వహించే ఉచిత టీకాల కార్యక్రమాన్ని జంతు ప్రేమికులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జేడీ, పశుసంవర్ధక శాఖ, అనంతపురం

తండ్రిపై కత్తితో కుమార్తె దాడి

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరులో శుక్రవారం రాత్రి తల్లిని కొడుతున్న తండ్రిపై కుమార్తె కత్తితో దాడి చేసి గాయపరిచింది. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య సుభద్రమ్మను భర్త సురేంద్ర తరచూ కొడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న సురేంద్ర తన భార్యను కొడుతుండగా కుమార్తె శాంతి అడ్డుకోబోయింది. ఆ సమయంలో కుమార్తెను పక్కకు నెట్టేశాడు. తండ్రిని నిలువరించేందుకు పక్కనే ఉన్న కత్తి తీసుకుని గాలిలో ఊపింది. అదే సమయంలో మత్తులో ఉన్న సురేంద్ర ముందుకు తూలడంతో అతని ముఖానికి గాటు పడింది. గాయపడిన సురేంద్రను వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడి తోట కంచె ధ్వంసం

హిందూపురం: చౌళూరు పంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధరప్పకు చెందిన మామిడి తోట కంచెను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని తన 7 ఎకరాల్లో ఆయన మామిడి సాగు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత టీడీపీ నాయకులు తోట చుట్టూ ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలను ధ్వంసం చేయడంతో కంచె మొత్తం కుప్పకూలింది. శుక్రవారం ఉదయం తోటకు వద్దకెళ్లిన సమయంలో విషయాన్ని రైతు గంగాధరప్ప గుర్తించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల వరకే రాజకీయాలకు పరిమితమై, ఆ తర్వాత అందరూ కలసిమెలసి ఐకమత్యంగా ఉండడం పల్లెల సంస్కృతి అని గుర్తు చేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా టీడీపీ నేతలు విష సంస్కృతిని అలవర్చుకోవడం బాధాకరమన్నారు. వ్యక్తిగత ఆస్తులు, పంట పొలాలను నష్టపరిచే విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. గంగాధరప్ప నిస్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తన సొంత భూమిలో 80 సెంట్లను ఉచితంగా ఇచ్చి ఉదారతను చాటుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై టీడీపీ నాయకులు కక్ష కట్టడం సరికాదన్నారు. రాజకీయ కక్షతో దాడులు చేయడం మానుకోకుంటే రాబోవు కాలంలో ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గంగాధరప్పకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, మాజీ సర్పంచ్ రాజు, లోకేష్‌రెడ్డి, నాగరాజు, ప్రకాష్, సూరి తదితరులుఉన్నారు.



ధ్వంసమైన కంచెను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పింఛన్లు, ఉపాధి పనుల్లో రూ.2 లక్షల అవినీతి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పథకంలో రూ.2 లక్షల మేర అవినీతి వెలుగు చూసినట్లు డీఆర్‌డీఏ పీడీ విజయప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని పంచాయతీల వారీగా డీఆర్పీలు తమ నివేదికను చదివి వినిపించారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ మొత్తం 552 ఉపాధి పనులు చేశారు. వేతన, సామగ్రి రూపంలో రూ.4,87,19,988 ఖర్చు చేశారు. ఇందులో రూ.37,550 అవినీతికి జరిగినట్లు గుర్తించి సంబంధిత అధికారుల నుంచి రికవరీకి ఆదేశించారు. అలాగే సామాజిక పింఛన్లలో రూ.1.65 లక్షలు అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని పీడీ విజయప్రసాద్ తెలిపారు. బసవనపల్లి పంచాయతీలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, ఆశ కార్యకర్త రూ.54 వేల పింఛన్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. అలాగే అమరాపురంలో మరణించిన వారి ఖాతాలో పింఛన్ డబ్బు రూ.6 వేలు, వి.అగ్రహారంలో మరణించిన వారి ఖాతాలో రూ.12 వేలు నగదు పడినట్లు తేలిందన్నారు. అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు రూ.36 వేలు, కె.శివరంలో అర్హత లేకపోయినా ముగ్గురు వితంతు పింఛన్‌ను రూ.36 వేలు తీసుకున్నారని, హలుకూరులో రూ.21 వేల పింఛన్ సొమ్ము పక్కదారి పట్టినట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే ఆ మొత్తాలను రికవరీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఏసీ నాగరాజు, ఏపీడీ లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయప్రసాద్

ముగిసిన షూటింగ్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పుట్టపర్తి: వచ్చే నెల గుంటూరు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ముగిసింది. బుక్కపట్నంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో చేపట్టిన ఎంపిక పోటీలకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో చరణ్‌కుమార్, తరుణ్, హర్షవర్ధన్, సాయి జశ్వంత్, నవీన్, గణేష్, నారాయణస్వామి, కేదార్‌నాథ్, మారుతి, రాజా ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టులో వర్ధిని, అక్షయ, షాలిని, మైత్రి, రక్షిత, సాయి భార్గవి, దీక్షిత, స్వర్ణ, గిరిజ, మౌనిక, స్వప్న, అర్షల్ చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్, కేజీబీవీ ఎస్‌ఓ సౌజన్య, పీడీ నాగరాజు తదితరులు అభినందించారు.

గర్భంలోనే శిశువు మృతి

- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమంటూ బాధితుల ఆరోపణ
- రెగ్యులర్ చెకప్‌లు చేయించుకోలేదని వైద్యుల వివరణ

హిందూపురం టౌన్: ప్రసవం కోసం హిందూపురం ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందింది. ఇందుకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మహిళ బంధువులు ఆరోపిస్తుండగా... తమ తప్పేమీ లేదని వైద్యులు తెలిపారు. వివరాలు... హిందూపురం సమీపంలోని కొల్లకుంట గ్రామానికి చెందిన గర్భిణి ముత్యాలమ్మ నెలలు నిండటంతో శుక్రవారం ప్రసవం నిమిత్తం హిందూపురం జిల్లాస్పత్రిలో చేరింది. వైద్యుల సూచనతో సిబ్బంది ఆమెకు ఆరోగ్య పరీక్షలతో పాటు, స్కానింగ్ చేశారు. అయితే అప్పటికే గర్భంలోని శిశువు మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భంలోనే శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ అక్కడకు చేరుకుని ముత్యాలమ్మ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమె వద్ద ఉన్న మాతా శిశు సంరక్షణ నమోదు పుస్తకం పరిశీలించగా, అందులో ఎలాంటి ఆరోగ్య పరీక్షల వివరాలు నమోదు కాలేదు. ముత్యాలమ్మకు రక్తం తక్కువగా ఉండడంతో గర్భంలోనే శిశువు చనిపోయిందని తెలిపారు. అందువల్ల ఆమెను అనంతపురానికి రెఫర్ చేశామన్నారు. దీనిపై అర్బన్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, ముత్యాలమ్మ గర్భం దాల్చినప్పటి నుంచి ఆశా కార్యకర్త, ఏఎస్ఎం, అంగన్‌వాడీ వర్కర్ ద్వారా అవగాహన కల్పించామని, అయినా ఆమె ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోలేదన్నారు. ఇందులో తమ తప్పేమీ లేదని తెలిపారు.



బాధితురాలు ముత్యాలమ్మ

నంద్యాల వాసి దుర్మరణం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- రోడ్డుపై పడి లేస్తుండగా దూసుకెళ్లిన మరో లారీ
- ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

మడకశిర రూరల్: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో నంద్యాలకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాలకు చెందిన అశోక్, నవీన్ గణేష్, గద్వాల్‌కు చెందిన అనిల్... స్నేహ కోళ్ల ఫారంలో సూపర్ వైజర్లుగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా రెండు ద్విచక్ర వాహనాలపై వారు గుడిబండ మండలం సీసీగిరిలోని పౌల్ట్రీఫారంను గురువారం సందర్శించి, కోడి పిల్లలను లెక్కించారు. అనంతరం రాత్రి మడకశిరకు ద్విచక్ర వాహనాలపై వెళుతుండగా యూ.రంగాపురం సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీని నిలబెట్టకుండా వెళ్లిపోయాడు. అదే సమయంలో రోడ్డుపై పడిన నలుగురూ పైకి లేస్తుండగా వెనుకనే వచ్చిన మరో లారీ దూసుకెళ్లడంతో అశోక్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో బయటపడిన నవీన్, గణేష్, అనిల్‌ను అటుగా వెళుతున్న వారు 108 అంబులెన్స్‌లో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో వివరాలు ఆరా తీసి, కేసు నమోదు చేశారు. ప్రమాదాలకు కారణమైన లారీలను గుర్తించేందుకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అశోక్ (ఫైల్)

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి: ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. 12వ పీఆర్సీ అమలులో భాగంగా తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పాఠశాల విద్యలో 117 జీఓను రద్దు చేయాలని, ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. ‘తల్లికి వందనం’ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. ఆగిపోయిన పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. పీఎఫ్, జీఎల్ఐసీ లోన్లు, ఫైనల్ సెటిల్‌మెంట్లు, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె. చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణిభూషణ్, జిల్లా నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, మల్లికార్జున, రామకృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి